ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తోంది

మేడ్చల్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ నాగేష్

చింతల్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నారని మేడ్చల్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ నాగేష్ ఆరోపించారు. ఏబీవీపీ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడ్ నాగేష్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తరగతికి కేవలం ఒక్కరే ఉపాధ్యాయులు ఉండటంతో నాణ్యతమైన విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని అన్నారు. అదేవిధంగా మౌలిక వసతులు కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం కూడా విఫలమైందన్నారు. పాఠశాలల్లో స్కావెంజర్లు, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పోషకాహారాన్ని అందించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.



◆ రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈరోజు వరకు విద్యాశాఖ మంత్రిని ఎందుకు ఖరారు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్నటువంటి రూ.5316

చింతల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్షిప్‌లను విడుదల చేయాలన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యా సంస్థలపై దృష్టిసారించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యా సంస్థలకు పక్కా భవనాలు నిర్మించే వరకు ఏబీవీపీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ, చరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలు



శంభీపూర్ రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి

దుండిగల్: మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లంపేటలో కౌన్సిలర్ అర్కల అనంత స్వామి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అమర్, బాలకృష్ణ, నరసింహ, రమేశ్, లక్ష్మణ్, కోటేష్, ప్రశాంత్, నందు, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చర్చిగాగిల్లాపూర్‌లో బీఆర్ఎస్ నేతలు సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జన్మదిన వేడుకలను నిర్వహించారు. నవ జ్యోతినికేతన్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శంకర్‌నాయక్, రవినాయక్, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా



ఎమ్మెల్యే వివేకానంద్‌ను జ్ఞాపికను అందజేసిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సైక్లింగ్ గ్రూప్ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజల ఆశీస్సులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం ఎంఎల్ఆర్ గ్రూప్ ఇనిస్టిట్యూషన్ చైర్మన్, వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సభ్యులు కశ్మీర్–కన్యాకుమారి వరకు దాదాపు 3800 కిలోమీటర్ల రైడ్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాయియాదవ్, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్ నందనూరి, టీమ్ మెంబర్లు రవీందర్‌రెడ్డి, సురేష్‌బాబు, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ కోర్ మెంబర్ భీమ్ సింగ్, సభ్యులు భాస్కర్, బాల్‌రాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

చెరువు స్థలాలను పరిరక్షించడంలో అధికారులు విఫలం



ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



ఎర్రకుంట చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణం

నిజాంపేట్: చెరువు స్థలాలను పరిరక్షించడంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ముదిరాజ్ ఆరోపించారు. గురువారం ప్రగతినగర్ సర్వే నం. 134లో ఉన్న ఎర్రకుంట చెరువును బీజేపీ నాయకులు సందర్శించి ఎఫ్‌టీఎల్‌లో జరుగుతున్న నిర్మాణాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సతీస్ మాట్లాడుతూ... 2016లో ఎర్రకుంట చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. అయితే గత ఆరు నెలలుగా కొందరు వక్తులు చెరువు ఫెన్సింగ్‌ను తొలగించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారన్నారు.

◆ ఎర్రకుంట బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ స్థలాలను పక్కనే ఉన్న 48, 49 సర్వేనంబర్లుగా చూపిస్తున్నారని అన్నారు. ఇరిగేషన్ శాఖ ఎన్‌ఓసీ లేకుండా మూడు నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. దీని వెనుక అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చెరువు కబ్జాలపై స్పందించి అక్రమదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, సెక్రటరీ అరుణ్ రావు, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ప్రసాద్‌రాజు, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ట్రేడల్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్, స్పోక్స్‌పర్సన్ కౌశిక్ నాయుడు, రంగ, శ్రీనివాసులు ఉన్నారు.

పేట్రేగిపోతున్న డంపింగ్ ముఠా

- రసాయన వ్యర్థాల డంపింగ్‌గా జీడిమెట్ల
- ఓ పార్టీకి చెందిన లీడర్ సోదరుడే ముఠా నాయకుడు
- ముడుపులు తీసుకుని మౌనం వహిస్తున్న అధికారులు



డంపింగ్ చేసి వెళ్లిపోతున్న ట్యాంకర్

జీడిమెట్ల: జీడిమెట్లలో కెమికల్ డంపింగ్ మాఫియా పేట్రేగిపోతుంది.. దూరప్రాంతాల నుంచి రసాయనాలను ట్యాంకర్లలో తీసుకువచ్చి జీడిమెట్లలో డంప్ చేస్తున్నారు. రసాయనాల డంపింగ్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండటంతో ట్యాంకర్లు కొనుక్కుని సాఫీగా జంకు లేకుండా గలీజు పనికి తెగబడుతున్నారు. 2017వ సంవత్సరంలో జీడిమెట్లలోని ఓ మూసివేసిన పరిశ్రమ అవరణలో పెద్ద డంపింగ్ కేంద్రం బయటపడింది. అప్పట్లో ఈ విషయం రాష్ట్రంలోనే హాట్ టాఫిక్‌గా మారింది. కాని డంపింగ్‌కు పాల్పడిన ముఠా మాత్రం అధికారులకు లంచాలు ఇచ్చి కేసు నుంచి బయటపడ్డారని అప్పట్లో బహిరంగంగానే వినిపించింది.

చౌటుప్పల్,గడ్డపోతారం,ప్రాంతాల నుంచి తీసుకువచ్చి జీడిమెట్లలో డంపింగ్..

కొంతమంది డంపింగ్ దందా నిర్వహించే గ్యాంగ్ సభ్యులు ఒక ముఠాగా ఏర్పడుతున్నారు. వీరు చౌటుప్పల్, గడ్డపోతారం, గాగిల్లాపూర్, బొంతపల్లిలోని పలు పరిశ్రమల్లో వ్యర్థ రసాయనాలను తరలించేందుకు ఒక్కో ట్యాంకర్‌కు 50వేల రూపాయలు అని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. నేరుగా రసాయనాలను రాత్రిపూట తీసుకువచ్చి జీడిమెట్లలో డంప్ చేసి గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోతున్నారు.

ఓ పార్టీకి చెందిన నాయకుడి సోదరుడే ముఠా నాయకుడు..

సూరారం కాలనీకి చెందిన ఓ పార్టీ నాయకుడి సోదరుడు ప్రస్తుతం డంపింగ్ దందాలో నాయకుడని అందరూ బహిరంగంగానే చెప్తున్నారు. ఇతగాడు మరికొంతమందితో కలిసి ట్యాంకర్లను కొనుగోలు చేసి దందాను కొనసాగిస్తున్నారు. ఆయన డంపింగ్ ముఠా నుంచి ప్రతినెల డబ్బులు వసూలు చేస్తూ పోలీసులు, పీసీబీ అధికారులను మేనేజ్ చేస్తున్నట్లు డంపింగ్ చేసేవారే నేరుగా చెబుతున్నారు.

జీడిమెట్లలో మాత్రమే డంపింగ్ ఎందుకు?

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఫేజ్–3లో రాత్రి 12గంటల తర్వాత జనసందోహం తక్కువగా ఉంటుంది. దీంతో డంపింగ్ ముఠా ఇదే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకున్నారు. ట్యాంకర్ స్పాట్‌కు వచ్చేకంటే ముందే రెండు బైక్‌లలో వారి మనుషులు అక్కడికి వచ్చేస్తారు. ట్యాంకర్ ముందు మరో కారులో వీరు వస్తూ మెల్లిగా ట్యాంకర్‌ను స్పాట్‌కు తీసుకువస్తారు. 10నిమిషాల్లో రసాయనాలను డంప్ చేసి అక్కడ నుంచి జంప్ అవుతారు.

పోలీసులు, పీసీబీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారు..

డంపింగ్ ముఠా ముందుగానే సంబంధించిన పోలీసులు, పీసీబీ సిబ్బందితో మాట్లాడుకుంటారు. దీంతో వారు ట్యాంకర్లు వచ్చి స్పాట్‌లో డంపింగ్ చేసి వెళ్లిన సైలెంట్‌గా ఉండిపోతారు. అధికారుల అలసత్వమే వీరికి అనుకూలంగా మారింది. ఇక డంపింగ్ చేసే ప్రాంతంలో ఉండే వాచ్‌మెన్‌లకు 500 వందల రూపాయలు ఇచ్చి ఎవరికి చెప్పవద్దని మేనేజ్ చేస్తున్నట్లు తెలుస్తుంది.



వారం క్రితం పట్టుబడిన ట్యాంకర్ జీడిమెట్ల పీఎస్‌లో..

కఠిన చర్యలు తీసుకోకపోతే ఇక కాలుష్యమే..

ఇప్పటికై నా అధికారులు చర్యలు తీసుకుని సదరు డంపింగ్ ముఠాపట్ల కఠినంగా వ్యవహరించకపోతే జీడిమెట్ల కాలుష్య కేంద్రంగా మారుతుందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు డంపింగ్ ముఠాను ఎంతవరకు కట్టడి చేస్తారో వేచి చూద్దాం..

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

నిజాంపేట్: ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 29వ డివిజన్ మధురానగర్ కాలనీలోని అష్టలక్ష్మి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం డిప్యూటీ మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.లక్ష విరాళంగా ఆయన ఆలయ కమిటీ సభ్యులు లింగయ్య, విష్ణు, రాంబాబులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాఘవేంద్రరావు, ఆవుల జగన్ యాదవ్, కుమార్‌రెడ్డి, దశరథ్, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్‌పీఐఈ ఫెలోగా ప్రొ.సోమవేణుగోపాలరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సోమ వేణుగోపాలరావు సొసైటీ ఆఫ్ ఫొటోగ్రాఫిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్స్ (ఎస్‌పీఐఈ) ఫెలోగా ఎన్నికయ్యారు.ఈయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్. ఎస్‌పీఐఈ అనేది ఆప్టిక్స్, ఫొటోనిక్స్ టెక్నాలజీ అంతర్జాతీయ ప్రొఫెషనల్ సొసైటీగా గుర్తింపు పొందింది. 184 దేశాల నుంచి రెండున్నర లక్షలకుపైగా నిపుణులతో కూడిన గ్లోబల్ సంస్థగా పనిచేస్తోంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

నేటి నుంచి ‘బ్రాండ్’ షో

సాక్షి సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో దేశంలోనే పేరొందిన ఫ్యాషన్ బ్రాండ్స్ ఉత్పత్తుల ప్రదర్శన శుక్రవారం నుంచి 3 రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని మాల్ ప్రతినిధులు తెలిపారు. జాక్ అండ్ జోన్స్, శంతను నిఖిల్, లెవిస్...తదితర 100కుపైగా విభిన్న రకాల బ్రాండెడ్ ఉత్పత్తులు ఈ ప్రదర్శనలో కొలువుదీరుతున్నాయని, వీటిని అనూహ్యమైన ఆఫర్లతో అందిస్తున్నామని వివరించారు.

దర్జాగా రోడ్డు కబ్జా.!



సంజయ్‌గాంధీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆనుకుని రోడ్డుపై ఇనుప రాడ్లను ఏర్పాటు చేసి కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: లక్షలాది రూపాయల విలువ చేసే ప్రజాధనాన్ని వెచ్చించి ఏర్పాటు చేసిన రోడ్డును కొందరు వ్యక్తులు పార్కింగ్‌కు వినియోగిస్తూ రాకపోకలకు ఆటంకం సృష్టిస్తున్నారు.. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రూ.25 లక్షలతో ఇటీవల బీటీ రోడ్డును నిర్మించారు. అయితే స్థానికంగా ఉండే కొందరు వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆనుకుని ఓ పక్క ఉన్న రోడ్డు ప్రాంతంలో ఇనుప రాడ్లను ఏర్పాటు చేసి వాహనాలను పార్క్ చేస్తున్నారు.

◆ జగద్గిరిగుట్ట–ఐడీపీఎల్ ప్రధాన రోడ్డును ఆనుకునే ఈ తతంగం జరుగుతున్నా సంబంధిత అధికారుల కళ్లకు కనిపించకపోవడం గమనార్హం. సుమారు 40 ఫీట్ల మేర ఉన్న రోడ్డులో సగం మేర ఆక్రమించడంతో మిగతా 20 ఫీట్ల గుండానే వచ్చీపోయే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఏర్పాటు చేసిన రోడ్డును తమ సొంత అవసరాలకు వాడుకుంటున్న సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చౌరస్తాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయండి

- ట్రాఫిక్ సిబ్బందిని నియమించండి: స్థానికులు



ఉషా ముళ్లపూడి హాస్పిటల్ చౌరస్తా వద్ద నిలిచిపోయిన వాహనాలు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బంది అందుబాటులో లేక ప్రతినిత్యం ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాజులరామారం, విలేజ్ చౌరస్తా, ఉషాముళ్లపూడి హాస్పిటల్ చౌరస్తాల మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటు బాచుపల్లి, మరో వైపు కూకట్‌పల్లి వైపు నుంచి ఈ మార్గం గాజులరామారం, షాపూర్‌నగర్‌లకు షార్ట్ కట్ కావడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుండటంతో కార్యాలయాలకు, స్కూళ్లకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ట్రాఫిక్ లో ఇరుక్కుని బయట పడటానికి అర్ధగంట పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. బుధవారం ఉషాముళ్లపూడి చౌరస్తా నుంచి సీఎంఆర్ స్కూల్ వరకు కార్లు, స్కూల్ బస్సులు గంటల పాటు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్మశానవాటికలో అక్రమ పార్కింగ్





చింతల్ శ్మశానవాటికలో అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలు

చింతల్: చింతల్ శ్మశానవాటిక అక్రమ పార్కింగ్‌లకు అడ్డాగా మారింది. ఓ వైపు మౌలిక వసతులు లేక శ్మశానవాటికకు వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా మరో వైపు అక్రమ పార్కింగ్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత మంది రాజకీయ నేతలు అండదండలతో వాహన యజమానులు నెలల తరబడి పార్కింగ్ చేస్తునన్నారు. ఈ అక్రమ పార్కింగ్ చేసేవారికి శ్మశానవాటిక నిర్వాహకులు అనుకూలంగా మారి నెలవారీగా కిరాయిల సైతం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి ప్రజాపాలన స్వీకరణ కేంద్రాలు ఇవే..

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాలు, కమిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణను ఉప కమిషనర్లు, సంబంధిత నోడల్ అధికారుల పర్యవేక్షిస్తున్నారు.

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

◆ గాంధీనగర్ కమిటీహాల్‌లో మారుతినగర్, గురుమూర్తినగర్ కమిటీహాల్‌లో ఏపీహెచ్‌బీ కాలనీ, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో ఏపీహెచ్‌బీ కాలనీ, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో సౌభాగ్యనగర్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో నెహ్రూనగర్.

సుభాష్‌నగర్ డివిజన్..

◆ సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో సుభాష్‌నగర్ ఫేజ్–1, ఎస్ఆర్ నాయక్ నగర్ కమిటీ హాల్‌లో పుప్పగిరి బస్తీ, అపురూపా కాలనీ కమిటీహాల్‌లో ఏకలవ్యనగర్, సూరారం లూయిస్ బ్రెయిలీ భవనంలో న్యూశివాలనగర్, రాజీరెడ్డినగర్.

కుత్బుల్లాపూర్ డివిజన్..

◆ పద్మనగర్ ఫేజ్–2 కమిటీహాల్‌లో సాయిబాబానగర్, మాణిక్యనగర్ కమిటీహాల్‌లో మల్లికార్జుననగర్, వాణినగర్ వినాయక మండపంలో వెంకన్నహిల్స్, కల్పన సొసైటీ హాలులో కాకతీయనగర్.

జీడిమెట డివిజన్..

◆ ప్రసూననగర్ కమిటీహాల్‌లో ఎంఎన్‌రెడ్డినగర్, దుర్గా ఎస్టేట్స్ కమిటీహాల్‌లో వీరాస్వామినగర్, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజెన్స్ భవనంలో రుక్మిణి ఎస్టేట్స్, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో గ్రీన్‌పార్క్ ఎన్‌క్లేవ్.

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

◆ గాజులరామారం వార్డు కార్యాలయంలో మహదేవపురం, ఉషోదయ కాలనీ కమిటీహాల్‌లో అంబేడ్కర్‌నగర్, దేవేందర్‌నగర్ కమిటీ హాల్‌లో బతుకమ్మబండ, సుభాష్‌చంద్రబోస్ కమిటీహాల్‌లో ఉమాదేవినగర్..

జగద్గిరిగుట్ట డివిజన్..

◆ జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో శివనగర్, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో సంజయ్‌పురి కాలనీ, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో షిర్డీహిల్స్, జగద్గిరినగర్ కమిటీహాల్‌లో మగ్దూమ్‌నగర్..

చింతల్ డివిజన్..

◆ ఎస్ఎల్‌బీనగర్ కమిటీహాల్‌లో షాపూర్‌నగర్, శ్రీనివాసనగర్ కమిటీహాల్‌లో వివేకానందనగర్, చింతల్ కాశీనాథ్ కల్యాణ మండపంలో శివనగర్.

సూరారం డివిజన్..

◆ నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో ఆదర్శ్ నగర్, రాజీవ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో స్కందానగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో శ్రీరామ్‌నగర్, సంజయ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో కళావతినగర్.

నేడు సదరన్ క్యాంప్

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగులకు సదరన్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పద్మజారాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 4, 18 తేదీల్లో చెవిటి, కంటి చూపు సరిగా లేని దివ్యాంగులకు... అదే విధంగా 11, 25వ తేదీల్లో మానసికస్థితి సరిగా లేని దివ్యాంగులకు క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు క్యాంప్ ఉంటుందన్నారు. దివ్యాంగులు తమ వెంట మీసేవ కేంద్రంలో బుక్ చేసుకున్న సదరన్ స్లాట్ జిరాక్స్, ఆధార్, కార్డు, ఫొటో, మెడికల్ రిపోర్ట్‌లను తీసుకురావాలని సూచించారు.

కురుమ బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తునామని మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని కురుమ బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను గురువారం ఆయన పరిశీలించారు. డ్రైనేజీ కంపుతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన భరతసింహారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాల్సిందిగా కోరారు. నాయకులు నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నందుగౌడ్, సందీప్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

ఒక్క రోజే 12,400 దరఖాస్తులు



కొంపల్లిలో అభయ హస్తం దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్ భైరి శ్రీవిద్య

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ భైరి శ్రీవిద్య అన్నారు. గురువారం కొంపల్లి 5వ వార్డులో ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన ఆమె పలువురి నుంచి అభయ హస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీవిద్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగానే అభయహస్తం దరఖాస్తులను స్వీకరిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 6 లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో గురువారం 12,400 మంది అభయ హస్తం దరఖాస్తులను అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ రంగారెడ్డినగర్ డివిజన్‌లో 1452, సుభాష్‌నగర్ డివిజన్‌లో 2014, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 2302, జీడిమెట్ల డివిజన్‌లో 1015 దరఖాస్తులు, అదే విధంగా గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్‌లో 1208, గాజులరామారం డివిజన్‌లో 2076, చింతల్ డివిజన్‌లో 992, సూరారం డివిజన్‌లో 1341 దరఖాస్తులు అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని గెలుచుకుంటాం



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కలిసిన కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రామృష్ణ బదిలీ

దుండిగల్: దుండిగల్ ఇన్‌స్పెక్టర్ రామృష్ణ బదిలీ అయ్యారు. రామకృష్ణ సైబరాబాద్ ట్రాఫిక్ అడ్మిన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో మేడ్చల్ జోన్‌లో సీసీఎస్‌లో పని చేస్తున్న సీహెచ్ శంకరయ్య ఇక్కడికి వచ్చారు. రామకృష్ణ గత 8 నెలల నుంచి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. రామకృష్ణ రిలీవ్ కాగా శంకరయ్య సెలవుల్లో ఉండటంతో బాధ్యతలు స్వీకరించేందుకు మరో నాలుగు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు దుండిగల్ డీఐగా పని చేస్తున్న శ్రీనివాస్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

మెజార్టీ ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం ఖాయం



హరివర్ధన్‌రెడ్డిని కలిసిన భాస్కర్‌గౌడ్

సుభాష్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజార్టీ సీట్లు కాంగ్రెస్ కై వసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నేత, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భైరి భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం దూలపల్లి గ్రామం నుంచి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పోటీల్లో సత్తాచాటిన బచ్‌పన్ విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: చింతల్, వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో చిన్నారులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలుగా నిర్వహించిన స్పెల్ బీ, షో అండ్ టెల్, లెమన్ అండ్ స్పూన్, క్విజ్, కలరింగ్, డ్యాన్స్, రన్నింగ్ పోటీల్లో చిన్నారులు ప్రతిభ కనబరిచారు. ఉత్తమప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, బ్రాంజ్ పతకాలతో పాటు కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్న చిన్నారులకు గురువారం పాఠశాల డైరెక్టర్ టీవీఆర్ కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మాజీ ఇన్‌స్పెక్టర్ కుమారుడు ఆత్మహత్య



మృతుడు జియో మ్యాథ్యూ

దుండిగల్: మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ మాజీ ఇన్‌స్పెక్టర్ కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. చర్చిగాగిల్లాపూర్ సెయింట్ మేరీస్ ఎంక్లేవ్‌లో మ్యాథ్యూ కోషి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఇతడికి భార్యా, కుమార్తె, కుమారుడు జియో మ్యాథ్యూ(38) ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు అవివాహితుడు.

◆ గత కొన్నేళ్లుగా జియో మ్యాథ్యూ మానసిక రుగ్మతలతో బాధపడుతు ఆస్పత్రిలో సైతం చికిత్స పొందుతున్నాడు. ఈనెల 3వ తేదీన జియో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మాథ్యూ కోషి గతంలో జీడిమెట్ల ట్రాఫిక్ సీఐగా పని చేసి ఉద్యోగ విరమణ పొందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.